
# మనిషి తనం

— ఎ.వి.జి.యస్.మూర్తి

తెలుగు కళాసమితి
- న్యూజెర్సీ
ఉగాది కథల పోటీలో
రూ. 300/-లు
బహుమతి పొందిన
కథ.

అప్పుడే తెలతెలవారుతోంది. వీధిలో ఏదో గోలగోలగా వుండడంతో రోజూ కంటే ముందే మెలకువ వచ్చింది. బయటి నుంచి రకరకాల గొంతులు గందరగోళంగా వినిపిస్తోంటే — నిద్ర మత్తు వదుల్చుకుని బయటకి వచ్చి చూశాను. మా ఇంటికి కాస్త దూరంలో వీధి మలుపు దగ్గర వుండే చెత్తకుండీ — చుట్టూ జనం గుమిగూడి వున్నారు. ఆడా, మగా మొత్తం వీధి వీధంతా అక్కడే వుంది.

అందరూ ఏదో వింతను, విచిత్రాన్ని ఉత్సుకతతో చూస్తున్నట్లు అనిపిస్తోంది. రెండడుగులు ముందుకేసి చెత్తకుండీలోకి తొంగిచూసి మళ్ళీ వెనక్కొస్తున్నారు. వాళ్ళ తరువాత ఇంకొకళ్ళు. చూసిన వాళ్ళు చూసినట్టు వెళ్ళిపోతుంటే మళ్ళీ కొత్తవాళ్ళు వచ్చి కలుస్తున్నారు. మొత్తానికి ఆ చెత్తకుండీ ఎందుకోగానీ చాలామందిని ఆకర్షిస్తోందని గ్రహించాను. అదేమిటో వెళ్ళిచూడాలని నాకూ అనిపించింది. కానీ ఉదయమే బయటికి పోయి ఆ రోడ్డున పోయేవాళ్ళందరితోనూ కలవడం - అనవసరమైన



విషయాల పట్ల ఆసక్తి కనపరచడం నా స్వభావానికే విరుద్ధం. అందుకే నా కాలు ముందుకు కదల్లేదు. గేటు దగ్గరే నిలబడి అలా చూస్తూ వున్నాను.

దొడ్లోంచి రాములమ్మ — "అంట్లేయండమ్మగారూ ..." అని పిలిచేసరికి లోపలికెళ్ళాను. రాములమ్మ మా ఇంట్లో చాలాకాలం నుంచీ పని చేస్తోంది. నిజాయితీ గల మనిషి. పని కూడా శుభ్రంగా, ఎక్కడా వంక పెట్టడానికి వీల్లేకుండా చేస్తుంది. ఎంత పని చెప్పినా విసుగుదల లేకుండా చేస్తుంది. అదుంది కాబట్టే సరిపోయింది, లేకపోతే ఈ పిల్ల వెధవలతో నా వల్ల అవుతుందా ... ఇంత చాకిరీ చేసుకోవడం? ఏదైనా నా అంతట నేనిస్తే తీసుకుంటుంది తప్ప అది కావాలని ... ఇది కావాలని అడిగే మనిషి కాదు. పెద్దదైంది. ఓపికలేక ఎక్కువిళ్ళల్లో పనికి నప్పుకోదు. పిడికెడు మెతుకులు పెట్టినా సంతృప్తిపడి గొడ్డు చాకిరీ చేసే రాములమ్మ లాంటి పనిమనుషులు ఈ రోజుల్లో ఎవరికి దొరుకుతారు! అయినా నేను కూడా చూసీ చూడకుండా ఇస్తూనే వుంటాను ఏదో ఒకటి. మొన్నటికి మొన్న జ్వరమొచ్చి ఖాయిలాపడితే మందూ మాకూ నేనే చూశాను. ఇంకో ఇంట్లో అయితే దానికి మాత్రం ఇలా సాగుతుందా? అందుకే కనిపెట్టుకుని పడుంది ఏళ్ళతరబడి.

రాములమ్మ చేత ఒకదాని తరువాత ఒకటి పని చేయిస్తూనే అవకాశం వచ్చినప్పుడల్లా గుమ్మంలోంచో, కిటికీలోంచో రోడ్డువైపు చూస్తూనే వున్నాను. ఇంకా జనం తగ్గలేదు. పాత మొహాలు పోయి కొత్త మొహాలు కనిపిస్తున్నాయి. 'ఏమిటో అక్కడ!' అనుకుని "ఇదిగో ... రాములూ! గిన్నెలు తోమాక గుడ్డలుతికేయ్ ... ఇప్పుడే వస్తాను" అంటూ వెళ్ళి మళ్ళీ గేట్లో నిలబడ్డాను.

పక్కింటి వాళ్ళ పదేళ్ళ పిల్ల తెల్లారిందగ్గర్నించీ చెత్తకుండీ దగ్గరే తారట్లాడి ఇదిగో ఇటే వస్తోంది. దాన్నడిగితే సరి, ఏమిటో తెలుస్తుంది.

"ఇదిగో పద్మా ... ఏమిటే అక్కడ గోల ... ఎందుకంత మంది జనం మూగారు?" అనడిగాను మెల్లిగా. ఆ పిల్ల - "ఆంటీ ... మరే ... అక్కడ చెత్తకుండీలో ఎవరో పాపాయిని పడేసిపోయార్ట ... అందరూ చూస్తున్నారు" అంటూ కళ్ళింత చేసుకుని చెప్పి తుర్రుమంది.

'అయితే సంగతదన్నమాట! ఏ దిక్కుమాలిందో కనిపడేసి పోయుంటుంది ... ఛీ ... ఛీ ... అదసలాడదేనా ... ఎలా మనసొప్పిందో ... పాపం పసిబిడ్డని పారేయడానికి ... ఆ ... ఏముంది ... వళ్ళు పై తెలీక ఎవడితోనో తిరిగుంటుంది ... తీరా మునిగాక వదుల్చుకు పోయుంటుంది.'

"ఇదిగో తాయారూ ... ఏమిటే విశేషం ..."

"ఆ ... ఏముంది ... మామూలు కథే ... మొన్న రాజమహల్ థియేటర్ దగ్గర కూడా ఇలాగే జరిగిందట ... ఎవరో చెత్తకుండీలో పసికందును పారేసి పోయారు ... ఆడపిల్ల ... ఎంత చక్కగా వుందనుకున్నావ్ ... చూస్తుంటే జాలేస్తోందనుకో ..."

"ఎవరో ... ఏమిటో..."

"బాగానే వుంది ... ఎవరో తెలిస్తే ఇంకనే ... ఏ నీతిమాలిందో అక్రమ సంతానాన్ని వదుల్చుకుంది. ఇలాంటి వాళ్ళ వల్ల కదూ ... ఆడవాళ్ళకి చెడ్డపేరు..."

తాయారు వెనకే వచ్చింది మరొకావిడ.

"అయినా అదేం పనే ... పురిటి కందు కదా ... ఏ కుక్కలో పీక్కు తింటే ఏం కావాలి ... ఏ అనాథాశ్రమం ముందో పడేస్తే వాళ్ళే చూసుకునే వాళ్ళు కదా..."

"ఆ ... మరే ... కలికాలం ... ఆడవాళ్ళు కూడా ఇలా తయారవుతున్నారు."

దోవనపోయే వాళ్ళంతా తలో విధంగా వ్యాఖ్యానించుకుంటూ వెళుతున్నారు. పసిబిడ్డ పట్ల ఎంతో జాలి, కనికరం వాళ్ళ మాటల్లో తొణికిసలాడుతున్నాయి.

కొందరు తల్లులైతే మనసు కరిగి కొంగులతో కన్నీళ్ళొత్తుకుంటూ పోతున్నారు.

"సనయింది ... వస్తానమ్మా!" అంటూ బయటికి వచ్చిన రాములమ్మ అందరి మాటలూ వింటిలా వుంది. అటు పరుగెత్తింది నేను పిలుస్తున్నా వినిపించుకోకుండా.

నేను దూరం నుంచి చూస్తూనే వున్నాను. ఈ ముసలి పీనుగ గుంపులోంచి దారి చేసుకుంటూ చెత్తకుండీ దగ్గరకు పోయింది. అందరూ నివ్వెరపాటుతో చూస్తుండగా పసిబిడ్డని తీసుకుని అదిగో గబగబా ఇటే వచ్చేస్తోంది. నా గుండె దడదడలాడింది. 'దీనికిదేం పోయే కాలం ... చెత్తకుండీలో బిడ్డని తీసుకుని ఇటొచ్చేస్తోంది?'

ఈసారి రాములమ్మ 'సెంటరాఫ్ ఎట్రాక్షన్' అయింది.

"ఇదెవరు!? ఆ పిల్లతో దీనికేంటి సంబంధం? ... అలా తీసికెళ్ళి పోతుందెక్కడికి ... పెంచుకుంటుందా ... ఏమో ... ఏమఘోరిస్తుందో ... ఎలా అయినా చావనీ ... ఎవరో ఒకరు తీసుకెళ్ళడమే మంచిది ... కుక్కలో, కాకులో పీక్కుతిన్నా చూసి చావలేము ఇటువంటివి ..." అనుకుంటూ పోతున్నారు కొందరు మా ఇంటి మీదుగా.

చెత్తలోంచి వెచ్చని చేతుల్లోకి మారేసరికి బిడ్డకి ఆకలి తెలిసినట్టుంది. కేరు కేరుమంటూ రాగం తీస్తోంది.

రాములమ్మ గుండెల దగ్గరగా పొదువుకుని మా గుమ్మం దగ్గరకు వచ్చింది. తెలియని జుగుప్సతో నా వళ్ళు జలదరించింది.

"ఏమిటే ఇది ..." గద్దించి అడిగాను.

రాములమ్మ బిడ్డ వంక జాలిగా చూసి - "ఏ తల్లి కన్నదో నమ్మా ... దిక్కు తోచక ఇట్లా వొగ్గేసి వుంటది ..." అంది.

"అయితే ... దారినపోయే దాన్ని ... నువ్వు నెత్తినేసుకుంటావా ... ఎవరికీ పట్టంది నీకెందుకు?"

"అట్టాగంటే ఎట్టాగమ్మా ... వొరో వొకరు సేరదీస్తేనే బిడ్డ సేవం ఏం కావాలి ... కూసిని పాలు పోయండమ్మా ... ఆకలవుతోందిలా వుంది బిడ్డకి."

"బాగానే వుంది ... నీకో దానికి దిక్కులేదు గానీ ... ఇదొకటా ... సాకటం నీ వల్లవుతుందనుకుంటున్నావా!?"

రాములమ్మ చిన్నగా నవ్వి అంది.

"సాకటానికి ఏటుందమ్మా ... మా బోటోల్లని వోరు సాకుతారు ... అయన్నీ కలిగినోల్ల బిడ్డలకి ... భగమంతుడే గాలి, నీరు పోసి పెంచుతాడు ... మీ బోటి తల్లులు రెండు మెతుకులు ఇదిపితే సేవం నిలుస్తుంది ..."

దాని మాటలు ఆశ్చర్యంగా వింటూ నిలబడిపోయాను. 'నిజమే ... ఆ చెత్త కుండీల చుట్టూ మూగ జీవాలతో కలిసిపోయి ఎన్ని ప్రాణులు సహజీవనం చేయడం లేదు ... వాళ్ళందర్నీ ఎవరు పెంచుతున్నారు ... ఎవరు పోషిస్తున్నారు!'

ఇంతలో మా బాబు "రాములమ్మా ... ఇదిగో పాలు" అంటూ గ్లాస్‌తో పాలు తెచ్చిచ్చాడు.

"మా బాబే..." అంటూ రాములమ్మ క్రింద కూర్చుని బిడ్డ నోట్లో చుక్క చుక్కగా పాలు పోస్తోంది.

గుక్కెడు పాలతో బొజ్జ నిండి అప్పుడే కేరింతలు కొడుతున్న పసిపాపను విస్మయంగా చూస్తున్నాను. ఈసారి అదేమిటో చిత్రం! ఆ దృశ్యం నా కంటికెంతో సుందరంగా కనిపిస్తోంది. ఆ పసిగుడ్డు మనుషులకు పుట్టిందిగానూ, రాములమ్మ మనిషిగానూ సహజంగా కూడా కనిపిస్తోంది. అంతకు ముందు జుగుప్స, అసహ్యం కలిగించిన దృశ్యం అదృశ్యమైపోయింది.

✻

నైతిక విలువలను అక్షరాలా పాటిస్తున్నవాళ్ళముగా మనల్ని మనం 'ఫోకస్' చేసుకుంటూ, లోకమంతా ఎంత నీతిమాలినదైపోతున్నదో చెప్పుకుంటూ ఆత్మసంతృప్తి పొందుతుంటాము. నిజానికి 'మనిషితనం' కోల్పోనివాళ్ళు యీ మాటలతో అవసరం లేకుండానే తాము మనుషులమని రుజువు చేసుకుంటూ వుంటారు.

"కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?"